# సుబ్బమ్మ సంసారంలో సంక్రాంతిపర్వం

ఈసారి తప్పకుండా వస్తానని వ్రాసారు, ఇంకా రాలేదని కలవరపడసాగింది లక్ష్మి. రాత్రి రెండుజాములైంది. పల్లెటూరు కావడంచేత కష్టజీవులు యింటికిరాగానే ఏగంజో కడుగో త్రాగి వళ్లుమరచి నిద్రాదేవి నెమ్మిలో కలసారు. కడుపునిండినవారు కాంతాజనం కౌగిళ్ళలో కట్టుబడ్డారు. సుబ్బమ్మ వంటయిల్లు చక్కబెట్టుకని పండగపనులు పూర్తిఅయాయనే ఆనందంతో నడుంవాల్చింది. కాని చిన్న అల్లుడు-లక్ష్మి మగడు- రాలేదనిమాత్రం మనస్సు చివుక్కుమనగా 'ఉస్సు'అన్నది. అత్తకి అల్లుడిమీద ఆశేగామరి. మొత్తంమీద వూరంతా నిశ్శబ్దంగానే ఉన్నదని చెప్పాలి

కాని భోగిమంటల ప్రయత్నంలోవున్న ప్రముఖులు- ఇచ్చినమ్మ 'పుణ్యాం యివ్వనమ్మ పాపం- అని అంటూవున్న మాటలు మాత్రం ఆనిశ్శబ్దాన్ని భంగంచేస్తున్నవి. వారినిచూచి కుక్కలు 'బౌయి బౌయి' మంటున్నాయి అక్కడక్కడ. ఆశబ్దానికి లక్ష్మి త్రుళ్ళిపడి లేచి కిటికీతీసి చూచేది ఆయన వస్తున్నారేమోనని. ఒక్కొకసారి ఎవరన్నా దొంగలేమోనని భయం. కారణం లేకపోలేదు. భోగిమంటలో లేక భీష్మునివల్లకాదో నాకు తెలియదుకాని ఆమంటలో ఎన్నెన్ని దొంగసామానులు తగులబడతాయో చెప్పలేం. పెద్దకాపుల దొడ్లో పిడకలగూడు, మునసబుగారి దొడ్లో కర్రలగుట్ట, ముసలమ్మ కుక్కిమంచం ఒకటేమిటి ఆరాత్రి ఆకోతిమూక కేదిదొరికితే అది తగులబడవలసిందే. దానికి అడ్డులేదు, ఫిరియాదు లేదు——

అర్థరాత్రి అయింది లక్ష్మి మంచంమీద అటుయిటు దొల్లుతోంది నిద్రరావటంలేదు. విరహిణికి నిద్రఎట్లు వస్తుంది? కుమిలి కుమిలి ఏడ్చింది. ఆమెతో బాటు ప్రకృతికూడా విలపించుచున్నదా యన్నట్లు మంచు బిందువులు బొటబొట రాలుతున్నవి. పండగ దొంగలు పక్కయింటి గోడపిడకలు వలిచే చప్పుడు వినబడి నిజంగా దొంగలు వచ్చారనే భయంచేత నోటమాటరాక దుప్పటీ గట్టిగా ముసుగుపెట్టింది లక్ష్మి...

ఇంతలో తొలికోడి కూసింది. కలకలమంటూ శకుంతసంతానాలు గూళ్ళలో గుడిగింతా లాడుతున్నాయి. 'కా కా' మంటూ కాకులు కలవరిస్తున్నాయి. పేరిశాస్త్రి పెద్దచెంబుచ్చుకు బయలుదేరాడు. దేవాలయంలో గంటలు గణగణ శబ్దము. ధ్వజస్థంభం మీది చిరుగంటల చిందులాట, ఖక్కువయిన కొద్దీ పొలాల్లో నక్కలకూతలు తగ్గిపోయాయి. కుప్పనూర్పులవారి పొలికేకలు- సంక్రాంతి జంగంవాని జేగంట- బుడబుడక్కలవాని ఢక్కానాదము- వీధులో చీపురుకట్టల చెలగాటం- భోగిమంటల ఫెళఫెళార్భాటం- తలంట్లు సాగించడానికి వచ్చిన మంగలి మహంతుగాడి బొబ్బలు- శివభక్తాగ్రేసరుల చిరుతాళముల సింహనాదము- పేడ కళాపీజల్లే పనివాండ్ర పిడతచప్పుళ్లు- ఇవిఅన్నీ కలిసి లక్ష్మిని తట్టినట్టు లేపాయి.

సుబ్బమ్మ దొడ్డితలుపుతీసి మహంతుకి నీళ్లకాగు నిప్పుపెట్టి పిండీ నూని యిచ్చి చిన్నాబ్బాయిని పెద్దబ్బాయిని ఒకళ్ళన్నమాటేంటి యింటిల్లపాదిని లేపింది.

చిన్నకోడలు కొత్తగా కాపరానికొచ్చినా

పండగకు తన అల్లుళ్లు వస్తారని ఆమెను సుబ్బమ్మ పుట్టింటికి పంపలేదు. ఆకోపమో లేక తాపమో మరి చలిమహత్వమో గాని అబ్బాయి లేవకండా అడ్డుతగిలింది- మళ్లా మహాంతు మొరపెట్టేదాకా.

అందరూ అరుణోదయం అయేటప్పటికల్లా అందంగాతయారై యారు. లక్ష్మిచెల్లెలు నిర్మల వీధిలో ముత్యాలముగ్గులుపెట్టి వాటి మీద గోమయంతో గొబ్బిళ్లుపెట్టి వాటి మీద గుమ్మడిపూలుగుచ్చి పూజచేసింది.

లక్ష్మికిమాత్రం పొద్దుఎక్కినకొద్దీ కుముదము వాడిపోయినట్లు, మంచుబిందువులు నూడిపోయినట్లు మగడువస్తాడన్న ధైర్యం శూన్యంకాగా చిన్నబోతోంది. ఆమె హృదయము విరహాగ్నికి వెన్నకరిగినట్లు కరిగిపోతోంది. కార్యం అయింతరువాత కలుసుకోలేదాయె. ఆమూడురోజులు మూతి విరుపులతోనే సరిపోయె——ఏంచేస్తుంది పాపం. పండగకి పట్టుకండువా తప్పకుండా కొని పెడతానని కూడా వ్రాసాడాయెను తండ్రి. యింతకన్నా ఏంచేయగలడు——దరిద్రుడు——

సుబ్బమ్మకూడా తలంటిపోసుకొని పులగం చక్రపొంగలి వంకాయిపచ్చిపులుసు చేసి వడ్డించింది. అందరూ తిన్నారు. లక్ష్మి ఆకలి లేదని మానేసింది. బెంగపెట్టుకున్నవానికి కడుపునిండుగా వుంటుంది. తల్లి బతిమాలినా వినలేదు. సరే దానిపుణ్యాం తరువాత తింటుందని వూరుకుంది విసువుతో. వినకపోతే ఏంచేస్తారు? మధ్యవచ్చిన వానిమీద యింత మమకారం ఎందుకో? కనిపెంచిన వారిని కూడా కాదనేశక్తి దేనిలోనున్నదో కదా!

దినకరుడు క్రొత్తగా అధికారములోకి వచ్చాట్టో లేక పెద్దలకి ముక్తినిస్తూయున్నానన్న మొగతనమో చాలా ఘోర్సుగా వెలిగి పోతున్నాడు గగనవీధిని. భోగిమంటలమీద పులగం వండుకుతిన్నారు పామరజనం. గొల్లలంతాకూడి అప్పన్నని పట్టుకుని 'అరిబల్లో అప్పన్నో' అంటూ, 'శ్రీరామారామ అయోధ్యా జిరామ' అంటూ గంతులేస్తున్నారు. మాదిగ జట్టు 'లిల్లీలపాట' ఒకమూల, పండగవస్తుందని వుల్లిపాయి మిరపకాయి పెట్టి పెంచిన కోడిపుంజుల పోట్లాటలొకమూల, గొర్రి పోట్లేళ్ళ పందా లొకమూల, కొత్తగావచ్చిన అల్లుళ్లు విడేసిన చతుర్ముఖపురాణ మొకమూల- యింకాఎన్నో. వూరు చిన్నదైనా వూళ్ళోవారు తొలకరి కప్పలను మరపించుచున్నారు. కడుపునిండిన బేరంకాదండి మరి' అంమలోను బలిచక్రవర్తి జన్మించాట్ట—— అనగా కుప్పనూర్పులైన వన్నమాట——

ఆసమయాన్ని ఒక యువకుడు. ట్రంకు చేతపట్టుకుని వీధంటవస్తున్నాడు. అప్పన్నని చూడ్డాని కెళ్ళిన నిర్మల గబగబా పరుగెత్తుకొచ్చి వచ్చాడే అక్కా అంది. నిజంగానే అంటూ నిర్ఘాంతపోయింది లక్ష్మి.

లక్ష్మి మోహనరావుకి తానే స్వయంగా తలంటి పోసి సహపంక్తిని కూచుని భోజనం చేసింది. భోజనా లయాక భుక్తాయాసంకోసం విశ్రమించారు.

అల్లుడు లేచేసరికి సుబ్బమ్మ అచ్చావు నేతితో మినపసున్ని కలిపింది. కుక్కలు వదలకుండా వుండడానికి బెల్లంపెట్టినట్లు అల్లుళ్లు వదలకుండా వుండడానికి అరిశెలు మినపసున్ని పెడతారు. బలిచక్రవర్తి పుణ్యామా అంటూ గాదులునిండితే కంచాలలో లోటుంటుందా మరి.

లక్ష్మి సంధ్యారాగములకు చక్కగా విడిచిన చంద్రకాంతపుష్పములను ముచ్చటగా దిద్దుకుంది. కొన్ని నిర్మలకి పెట్టింది. దొడ్డిలోని బంతిపూలు దండలుగుచ్చి గుమ్మాలకి కట్టింది. నిర్మల వీధిలో నీళ్లుచల్లి దివ్యమైన

ముత్యాలముగ్గులు పెట్టి సందెగొబ్బిళ్లు పెట్టి

'సుబ్బిగొబ్బెమ్మా' శుభ్ర మివ్వవే,
మల్లెపువ్వంటి మరదల నీయవె,
మామిడిపండంటి మరిది నీయవె,
పనసపండంటి పడతి నీయవె,
అరటిపండంటి అల్లుళ్ల నీయవె,
తామరపూవంటి తమ్ముణ్ణీయవె,
మొగలిపొత్తంటి మొగణ్ణీయవే'

అంటూ పాడుతోంది. ఇట్లా యిల్లు దేవేంద్ర భవనంలా సందడిగావుంది. ఆసందడిలో లక్ష్మి విలాసానికి అంతులేదు.

మరునాడు పెద్దపండుగ. పేరిశాస్త్రి పొద్దున్నే లేచి దర్భకట్ట బుజానవేసుకొని దడదడ నడుస్తున్నాడు యింటింటికి. పాటకపుజనం పెద్దలకి పెట్టుకోటానికి కూరగాయలు దండుకుంటున్నారు. త్యాగంలో బలిని మరపించాలని భాగ్యవంతులు కొత్తగుమ్మడికాయలు బద్దలకొట్టి పంచిపెడుతున్నారు. ఆమహానీయుడు రాజ్యమేలుతున్నాడు కాబట్టి మీరు బాగాదానంచేయాలని కూలీనాలీ చేసి గడించిన గింజలను గుంజుతున్నారు బ్రాహ్మణులు. లేకపోతే పెద్దలు తరించరట. వీళ్ళకి పిండం పెడితే వాళ్లు ధన్యు లవుతారట—

ఆరోజున దూడలపాలుకూడా పితకరు పామరజనం. కనుము నాడు కడతేరతాడట. అపును యిచ్చేశాక వుండేదేముంది. సంక్రాంతినాడు. అంతాకొత్తే, క్రొత్తబియ్యం, కొత్తబెల్లం కొత్తబట్టలు. ఆరోజు దివ్యంగా గడిచింది. అందరిమాట ఎలావున్నా లక్ష్మికి మాత్రం పెద్దపండగైయింది.

కె. లక్ష్మీ రాజ్యం.

* రాళ్లు అరిగినా?
* నీరసం వదలదు!!

జీవించాలనే ప్రతిజీవికీ ఆహారం అత్యావసరం
ఆహారంలేక- జీవించడమే- అసంభవం-
ఆహారం ఎంత పుష్టికరమైందయితే
ఆయుర్దాయం అంత అభివృద్ధౌతుంది.

కాని ప్రతివారు తినే ఆహారంలోనూకూడ ముఖ్యమైన పుష్టికర పదార్థాలు లోపించే ఉంటాయి అందువల్లే- ఎంతతిన్నా- నీరసం వదలకపోవడం.

లోపించిన పదార్థాలను చేర్చుకొనేందుకు ఆరోగ్యవంతులతో పోటాపోటీలకు తయారు అయేందుకు

స్వామీస్ "అమృతప్రాశ"

పుచ్చుకుతీరాలి.

అశ్విన్ కుమార ఫార్మశీ, నర్సాపురం